


గురువారం 6 ఆగస్టు 2026 పేజీలు : 8

# నీట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థి భరత్‌కు సన్మానం




నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 5: నారాయణఖేడ్ నియోజకవర్గంలోని కంగ్టి మండలం గాజుల్పాడు గ్రామపంచాయతీకి చెందిన విద్యార్థి భరత్ నీట్ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో 347వ ర్యాంకు, ఆల్ ఇండియా స్థాయిలో 2,04,008వ ర్యాంకు సాధించిన సందర్భంగా బుధవారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి ఘనంగా సన్మానించారు. విద్యార్థికి శాలువా కప్పి, స్వీట్లు తినిపించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ..మారుమూల గ్రామం నుంచి ప్రతిభ కనబరిచి మంచి ఫలితాలు సాధించడం అభినందనీయమని అన్నారు. భవిష్యత్తులో వైద్య విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించి గ్రామానికి, నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అలాగే విద్యార్థి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివాజీ పాటిల్, సర్పంచ్ నర్సింగ్, కౌన్సిలర్ బి. రాజు ముదిరాజ్, కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ముఖేరిపీర్ దర్గా ప్రహరీ గోడ ధ్వంసం





## బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్ట్ 5:**

నారాయణఖేడ్ పట్టణంలోని చారిత్రాత్మక ముఖేరిపీర్ దర్గా ప్రహరీ గోడలోని కొంత భాగాన్ని ఈరోజు గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన ఉద్రిక్తతకు దారితీసింది. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే అక్కడికి చేరుకోగా,దుండగుల్లో కొందరు అక్కడి - మిగతా3లో

## నల్లవాగు ప్రాజెక్ట్ కాలువలకు

# సాగునీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి, ఆగస్టు 5:**

భారీ వర్షాల కారణంగా పూర్తిస్థాయిలో నీరు చేరి అలుగు పారుతున్న నల్లవాగు ప్రాజెక్టు నుంచి సాగునీటిని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి బుధవారం ఎడమ, కుడి కాలువల ద్వారా అధికారికంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..నారాయణఖేడ్ నియోజకవర్గంలోని - మిగతా3లో





# డిజిటల్ యుగంలో తెలివిగా ఉండండి

# సైబర్ మోసాలకు దూరంగా ఉండండి







ఫోన్‌లో కనిపించే ప్రతి లింక్ నిజం కాదు...ఒక్క క్లిక్‌తో ఖాతా ఖాళీ...

స్టాక్ మార్కెట్ పేరుతో మోసం –ఉద్యోగాల పేరుతో దోపిడీ...

ఫోన్‌లో కనిపించే ప్రతి లింక్ నిజం కాదు – అప్రమత్తతే ప్రాణరక్ష

తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్

**తూప్రాన్ (ప్రజాజ్యోతి) ఆగస్టు 05:** ఆన్‌లైన్ ప్రపంచం ఎంత వేగంగా విస్తరిస్తుందో, అంతే వేగంగా సైబర్ నేరగాళ్లు కూడా కొత్త కొత్త పద్ధతులతో ప్రజలను మోసం చేస్తున్నారని తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్ హెచ్చరించారు. సైబర్ నేరాల నుంచి బయటపడాలంటే ప్రతి ఒక్కరిలో అవగాహన, అప్రమత్తత తప్పనిసరి అని పేర్కొన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో చేపట్టిన సురక్ష కా తిరంగా -- సైబర్ స్వతంత్ర తెలంగాణ కార్యక్రమంలో భాగంగా చేగుంట కస్తూర్బా బాలికల పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక అవగాహన సదస్సులో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఇటీవల పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలపై పలు కీలక అంశాలను వివరించారు. ముఖ్యంగా స్టాక్ మార్కెట్ పెట్టుబడుల పేరుతో సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలు, వాట్సాప్ గ్రూపుల ద్వారా చూపించే నకిలీ లాభాల వివరాలు పూర్తిగా మోసపూరితమైనవని స్పష్టం చేశారు. సులభంగా డబ్బు వస్తుందనే ఆశతో పెట్టుబడులు పెడితే చివరికి భారీ నష్టాలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఉద్యోగాల పేరుతో ఫీజులు, డిపాజిట్లు లేదా ఇతర చార్జీలు అడిగే వ్యక్తులను నమ్మవద్దని సూచించారు. అలాగే బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, పిన్ నంబర్లు, పాస్‌వర్డ్లు వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు చెప్పొద్దని తెలిపారు. గుర్తు తెలియని లింకులు, నకిలీ వెబ్‌సైట్లు, ఫేక్ సోషల్ మీడియా అకౌంట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్‌ను సంప్రదించి ఫిర్యాదు నమోదు చేయాలని, సమయానికి స్పందిస్తే డబ్బులు తిరిగి వచ్చే అవకాశాలు కూడా ఉంటాయని వివరించారు.విద్యార్థులు కేవలం తమకే పరిమితం కాకుండా ఇంట్లోని కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులకు కూడా సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. డిజిటల్ ప్రపంచంలో జాగ్రత్తగా వ్యవహరించే ప్రతి పౌరుడే సురక్షిత తెలంగాణ నిర్మాణానికి భాగస్వామి అవుతాడని అన్నారు.కార్యక్రమం అనంతరం విద్యార్థులతో సైబర్ భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సైబర్ ప్రపంచంలో అప్రమత్తత అవసరం: మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు




**మెదక్ (ప్రజా జ్యోతి)** సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా కొత్త రూపాల్లో పంజా విసురుతున్నాయని, డిజిటల్ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు సూచించారు. జాతీయ సైబర్ జాగృతి దివస్ సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో చేపట్టిన "సురక్ష కా తిరంగా -- సైబర్ స్వతంత్ర తెలంగాణ" కార్యక్రమంలో భాగంగా బుధవారం మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైబర్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... రాష్ట్రంలో రోజురోజుకూ సైబర్ నేరాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం విద్యార్థులే కాకుండా, తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా సైబర్ మోసాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతమైన డిజిటల్ పౌరుడిగా వ్యవహరించినప్పుడే "సైబర్ స్వతంత్ర తెలంగాణ" లక్ష్యం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులచే సైబర్ అవగాహన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ (ఐపీఎస్), డిఎస్పీలు సుభాష్ చంద్రబోస్, ప్రసన్న కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. హుస్సేన్, డాక్టర్ టి. మల్లేశం, వి. మురళి, డాక్టర్ ఆర్. శ్రీలతతో పాటు సైబర్ క్రైమ్ సిబ్బంది సతీష్, సయ్యద్, సాయి కిరణ్, స్వప్న మరియు పెద్ద సంఖ్యలో కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే చొరవ తో అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు





**మెదక్ ( ప్రజాజ్యోతి )** మెదక్ పట్టణంలోని 5 వ వార్డులో టియుఎఫ్ఐడిసి డ యుఐడిఎఫ్ పథకాల కింద మంజూరైన 50 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా పట్టణ అభివృద్ధే తమ లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పని చేస్తున్నారని అన్నారు. ఏ వార్డు ఏ పార్టీ కి చెందిన వారు ఉన్న భేదాభిప్రాయం లేకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 5వ వార్డు కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, కో–ఆప్షన్ సభ్యుడు తాహెర్, నాయకులు కానుగు భూపతి రాజు, మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, పట్టణ అధ్యక్షుడు మందుల గంగాధర్, మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి. సత్యనారాయణ, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ జె. నితిన్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మహంకాళి అమ్మవారి బోనాలు, తొట్టెల ఊరేగింపు,

**ముత్యాలమ్మ ఫలహారం బండి తొట్టెల ఊరేగింపు మహోత్సవాలకు కంఠరెడ్డి తిరుపతిరెడ్డికి ఆహ్వానం.**



**మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో (ప్రజా జ్యోతి )** ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్న శ్రీ మహంకాళి అమ్మవారి బోనాలు ,తొట్టెల మహోత్సవం,శ్రీ ముత్యాల మ్మ పలహారం బండి,తొట్టెల ఊరేగిం పు,మరియు సగర ఆధ్వర్యంలో శ్రీ మహంకాళి అమ్మవారి తొట్టెల ఊరేగింపు మహోత్సవాలకు విచ్చేసి విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులు బీఆర్ఎస్ నాయకులు కంఠరెడ్డి. తిరుపతిరెడ్డిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా బుధవారం ఉత్సవ కమిటీ సభ్యులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ మహోత్సవాలకు తప్పకుండా హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కసిరెడ్డి. మాణిక్య రెడ్డి ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు దశాబ్దాల సేవకు ముగింపు



మెదక్ (ప్రజా జ్యోతి ) సూర్యా మెడికల్ వ్యవస్థాపకుడు రవీంద్ర కన్నుమూత మున్సిపల్ షాప్ లీజ్ భారము ఆర్థిక ఒత్తిళ్లతో గుండెపోటు మెదక్లో విషాద ఛాయలు కన్నీరు మున్నీరవుతున్న కుటుంబ సభ్యులు వ్యాపారులు. మెదక్ పట్టణంలో 4 దశాబ్దాలుగా ప్రజల నిబద్ధతతో ఔషధ సేవలు అందించిన విశ్వాసాన్ని సంపాదించుకున్న సూర్య మెడికల్ స్టోర్ వ్యవస్థాపకుడు రవీందర్ బుధవారం గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన ఆకస్మిక మరణం మెదక్ పట్టణ ప్రజలకు వ్యాపారుల వర్గాలకు తీవ్ర విషాదంలో నెట్టింది.మెదక్ బస్టాండ్ ఎదురుగూగా ఉన్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ లో "సూర్య మెడికల్ స్టోర్" ను స్థాపించిన రవీందర్ దాదాపు 40 ఏళ్లుగా నిరంతరం గా ప్రజలకు ఔషధ సేవలు అందించారు చిరునవ్వుతో రోగులను ఆదరిస్తూ అవసరమైన వారికి సహాయం చేస్తూ ఆయన స్థానిక ప్రజా అభిమానాన్ని పొందారు వ్యాపార జీవితాన్ని బాలాజీ సైకిల్ స్టోర్ లో ఉద్యోగిగా ప్రారంభించి అనంతరం "శివ బెల్లయ్య మెడికల్ స్టోర్స్" లో అనుభవం సంపాదించి అనుభవంతో సొంతగా సూర్యా మెడికల్ స్టోర్ ప్రారంభించి కష్టపడి ఎదిగి మెడికల్ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నాడు. ఇటీవల మున్సిపాలిటీ నిర్వహించిన ఓపెన్ వేలంలో షాప్ కిరాయి భారీగా పెరగడంతో నెలకు సుమారు 50 వేల లీజు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పండి ఈ భారాన్ని భరించడం కష్టంగా మారడంతో కుటుంబ సభ్యులు మున్సిపల్ కమిషనర్ చైర్ పర్సన్ వైస్ చైర్మన్ లను కలిసి సమస్యను వివరించినా ఉపశమనం కల్పించాలని విజ్ఞప్తి చేశారు సమస్యను పరిశీలిస్తాం అని న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినప్పటికీ పెరిగిన ఆర్థిక ఒత్తిడి మానసిక ఆందోళన మధ్య రవీందర్ గుండెపోటుతో మృతి చెందడం అందరిని కలిసి వేస్తుంది.

# కాలనీల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక..

**-ఒక కోటి 40 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..**

**పటాన్ చెరు(ప్రజాజ్యోతి)** పటాన్ చెరు ముత్తంగి డివిజన్ పరిధిలోని నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని నందన్ ప్యారడైజ్ కాలనీలో 67.5 లక్షల రూపాయలతో చేపట్టనున్న సిసి రోడ్లు, ముత్తంగి డివిజన్ పరిధిలోని డిఎన్ కాలనీలో 36.5 లక్షల రూపాయలతో చేపట్టనున్న పైపులైను నిర్మాణ పనులు, వెలిమల స్మశాన వాటికలో 36.08 లక్షల రూపాయలతో చేపట్టనున్న రిటైనింగ్ వాల్ పనులకు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పటాన్ చెరు నియోజకవర్గంలోని ప్రతి కాలనీని అన్ని మౌలిక సదుపాయాలతో ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని అన్నారు. ప్రజలకు అవసరమైన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి సరఫరా, విద్యుత్ సదుపాయాలు, వీధి దీపాలు వంటి మౌలిక వసతులను దశలవారీగా కల్పిస్తూ సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా




తెలుసుకొని, వాటి పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. ప్రజల సహకారంతో నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఇంజనీరింగ్ విభాగం ఈఈ సురేష్, డిఈ కృష్ణవేణి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రాములు గౌడ్, శ్రీకాంత్ గౌడ్, విజయ్ కుమార్, ఉపేందర్, దేవేందర్ యాదవ్, కొమరయ్య, శ్రీశైలం, ఉమేష్, నాగరాజు, రవీందర్ రెడ్డి, నర్రా బిక్షపతి, కుమార్ గౌడ్, ప్రభాకర్, మేరాజ్ ఖాన్ రామకృష్ణ వెంకటేష్, అశోక్, రాజ్ కుమార్, రామకృష్ణ, రవి, తదితరులు పాల్గొన్నారు.

## వ్యభిచార వృత్తికి స్వస్తి.. గౌరవప్రద జీవితానికి పోలీసుల చేయూత

మహిళలకు పునరావాసం

ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వ శాఖల సమన్వయం

తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్



**తూప్రాన్ (ప్రజాజ్యోతి), ఆగస్టు 05:**వ్యభిచార వృత్తిలో కొనసాగుతున్న మహిళలు గౌరవప్రదమైన జీవితం గడపాలని, వారిని సమాజంలో స్వయం ఉపాధితో నిలదొక్కుకునేలా చేయడమే పోలీస్ శాఖ లక్ష్యమని డీఎస్పీ నరేందర్ గౌడ్ తెలిపారు. మెదక్ జిల్లా నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని సరోజినీనగర్ జాతీయ రహదారి సమీపంలో వ్యభిచార వృత్తిలో ఉన్న మహిళలను గుర్తించిన పోలీసులు, మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ ఆదేశాల మేరకు ప్రత్యేక కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 16 మంది మహిళలను షెల్టర్ హోంకు తరలించి, వారి పునరావాస ప్రక్రియను ప్రారంభించారు.వారిలోని నైపుణ్యాలను గుర్తించి, వాటికి అనుగుణంగా ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు డిఆర్డిఏ మరియు డి ఆర్ డి ఓ తో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆర్థిక స్వావలంబనకు అవసరమైన సహాయంపై అధికారులు చర్చించి కార్యాచరణ రూపొందించారు. మహిళలు మళ్లీ అదే వృత్తిలోకి వెళ్లకుండా ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించి, సమాజంలో ఆత్మగౌరవంతో జీవించేలా చేయడమే పోలీస్ శాఖ సంకల్పమని డీఎస్పీ నరేందర్ గౌడ్ స్పష్టం చేశారు. మహిళల భద్రత, పునరావాసం, సామాజిక పునఃస్థాపన కోసం అన్ని ప్రభుత్వ శాఖలు సమిష్టిగా పనిచేస్తాయని తెలిపారు. అనంతరం సరోజినీనగర్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను డీఎస్పీ ప్రారంభించారు. జాతీయ రహదారి పరిసరాల్లో నిఘా మరింత బలోపేతం కావడంతో పాటు అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు ఇవి దోహదపడతాయని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జహీరాబాద్లో వార్డు నెంబర్ 1లో సిసి రోడ్డు నిర్మాణ పనులకు ఘనంగా శ్రీకారం

ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్



**జహీరాబాద్,ఆగస్ట్ 05(ప్రజా జ్యోతి న్యూస్ )** జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని వార్డు నెం:1లో ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించే దిశగా నూతన సిసి రోడ్డు నిర్మాణ పనులకు ఈరోజు మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ శంకుస్థాపన చేసి అధికారికంగా శ్రీకారం చుట్టారు. స్థానిక ప్రజల దీర్ఘకాలిక డిమాండ్ కు అనుగుణంగా ఈ అభివృద్ధి పనులు ప్రారంభం కావడంతో వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ మాట్లాడుతూ, పట్టణంలోని ప్రతి వార్డులో మౌలిక వసతుల అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. వర్షాకాలంలో బురద, గుంతలు, నీటి నిల్వల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తాత్కాలికంగా తొలగించేందుకు ఇప్పటికే పలు వార్డుల్లో కంకర చిప్స్ వేయించడం జరిగిందన్నారు. మరియు శాశ్వతంగా తొలగించేందుకు నాణ్య మైన సిసి రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని, ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అను గుణంగా పనులు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ప్రజల పన్నుల రూపంలో వచ్చిన ప్రతి రూపాయిని పారదర్శ కంగా వినియోగిస్తూ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి మున్సిపల్ పాలకవర్గం కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్, డిఈ మహేష్, ఏఈ వెంకటేష్, వైస్ చైర్మన్ శిరీష సురేందర్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ రంగా అరుణ్ కుమార్,సినియర్ నాయకులు శ్రీకాంత్ రెడ్డి ఇతర కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, మరియు వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన స్థానికులు మాట్లాడుతూ, తమ వార్డులో ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న సిసి రోడ్డు పనులు ప్రారంభం కావడం ఆనందంగా ఉందని, పనులు త్వరగా పూర్తయితే రాకపోకలు సులభతరం కావడం తో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందు లు కూడా తొలగిపోతాయని ఆశ భావం వ్యక్తం చేశారు. మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో పట్టణంలోని అన్ని వార్డుల్లో రహదారులు, మురికి కాలువలు, తాగునీరు సౌకర్యాలు, విద్యుత్ సంబంధిత మౌలిక వసతులు తదితర అభివృద్ధి కార్యక్రమాలను దశలవారీగా చేపడుతూ జహీరాబాద్ ను ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

## టీడబ్ల్యూజేఎఫ్ మహాసభను విజయవంతం చేయాలి

**అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బాదిని శ్రీను, కొత్తకొండ సత్యం పిలుపు**





**పటాన్ చెరు(ప్రజాజ్యోతి)** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) పటాన్‌చెరు నియోజకవర్గ మహాసభను జర్నలిస్టులందరూ కలిసికట్టుగా విజయవంతం చేయాలని టీడబ్ల్యూజేఎఫ్ పటాన్‌చెరు నియోజకవర్గ అధ్యక్షుడు బాదిని శ్రీను, ప్రధాన కార్యదర్శి కొత్తకొండ సత్యం పిలుపునిచ్చారు. ఈ మేరకు వారు ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. పటాన్‌చెరులోని ఐబీ గెస్ట్ హౌజ్ (అతిథి గృహంలో) ఈ మహాసభను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న వర్కింగ్ జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులు ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో తరలివచ్చి సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ మహాసభకు టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర, జిల్లా స్థాయి ముఖ్య నాయకులు, బాధ్యులు హాజరుకానున్నట్లు నాయకులు పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, ఎదుర్కొంటున్న సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు.

## ఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించిన డీఐఈఓ గోవింద్ రామ్



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 5:** జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి డీఐఈఓ గోవింద్ రామ్ బుధవారం నారాయణఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. అనంతరం కళాశాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో ఈ విద్యా సంవత్సరంలో నమోదైన అడ్మిషన్లపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్‌లో 480 మంది, రెండవ సంవత్సరం ఇంటర్మీడియట్‌లో 430 మంది విద్యార్థులు చేరగా, మొత్తం 910 మంది విద్యార్థులు కళాశాలలో విద్యనభ్యసిస్తున్నట్లు వివరించారు. కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 993 మార్కులతో స్టేట్ టాప్ ఫలితాన్ని సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. కళాశాలకు మంజూరైన స్పోర్ట్స్ మెటీరియల్ ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మహేష్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## తల్లిపాలు శిశువుల ఆరోగ్యానికి అమూల్యం

**-- బేటి బచావో, బేటి పడావో అవగాహన సదస్సులో**

**- సిడిపిఓ ఎన్. సుజాత**

**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 5:** తల్లిపాలు శిశువుల ఆరోగ్యానికి అమూల్యమైనవని నారాయణఖేడ్ ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ ఎన్. సుజాత అన్నారు. బుధవారం రామచంద్ర తాండా, పొడిచేటిపల్లి తండా, మొదలకుంట అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి కేంద్రాల పనితీరును పరిశీలించారు. అనంతరం మహిళా శిశు సంక్షేమ శాఖ, ఐసిడిఎస్ నారాయణఖేడ్ ప్రాజెక్టు మరియు జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో నాగధార గ్రామంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు, బేటి బచావో బేటి పడావో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శిశువు పుట్టిన గంటలోపు తల్లిపాలు ఇవ్వడం వల్ల అవసరమైన పోషకాలు అందడంతో పాటు రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. ప్రతి తల్లి తొలి ఆరు నెలల పాటు శిశువుకు కేవలం తల్లిపాలు మాత్రమే అందించాలని సూచించారు. గ్రామ సర్పంచ్ జకరయ్య మాట్లాడుతూ..బేటి బచావో బేటి పడావో కార్యక్రమం ద్వారా బాలికల రక్షణ, విద్య, సాధికారతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రమీల, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఫైనాన్షియల్ లిటరసీ స్పెషలిస్ట్ పి. నర్సింలు, గ్రామ ఉపసర్పంచ్, ఏఎన్ఎం, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ ఆయాలు, గర్భిణీలు, బాలింతలు, తల్లులు, మహిళలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ కార్మిక,రైతు,వ్యవసాయ కార్మికుల వ్యతిరేక విధానాలపై

**ఆగస్టు 10న జైల్ భరో జయప్రదం చేయండి**

**క్విట్ ఇండియా ఉద్యమం స్ఫూర్తి తో ఉద్యమిద్దాం**

**వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్ పిలుపు**



**జహీరాబాద్, ఆగస్టు 05(ప్రజా జ్యోతి న్యూస్)** కేంద్ర ప్రభుత్వం అవలంభీస్తున్న ప్రజా కార్మిక రైతు వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానా లకు వ్యతిరేకంగా, హక్కుల సాధనకు స్వాతంత్ర పోరాట క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10వ తేదీన జరిగే జైల్ భరో జయప్రదం చేయాలనీ, క్విట్ ఇండియా ఉద్యమం స్ఫూర్తి కొనసాగించాలని వ్యవ సాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్ పిలుపునిచ్చారు. బుధవారం జైల్ భరో జయప్రదం కోసం సిఐటియు జహీరాబాద్ పారిశ్రామిక క్లస్టర్, టౌన్ కమిటీల ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా వచ్చిన సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక రైతు వ్యవసాయ కూలీల హక్కులను హరిస్తూ లేబర్ కోడ్స్, విబిజి రామ్జి తేవడం, రైతు నల్ల చట్టాలను మళ్ళీ తేవడానికి ప్రయత్నిస్తున్నదని వీటికి వ్యతిరేకంగా, ఉపాధి హామీ చట్టాన్ని నీరు గారుస్తుందని, కూలీలను ముంచుతుంది అన్నారు.స్వాతంత్రోద్యమంలో క్విట్ ఇండియా ఉద్యమం స్ఫూర్తి తో ఈ జైలు భరో కార్యక్రమాన్ని కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ జైల్ భరో జరుగుతుందని, ఈ జైల్ భరో జయప్రదం కోసం సిఐటియు పారిశ్రామిక క్లస్టర్, టౌన్ కార్యకర్తలు జయప్రదం చేయాలనీ పిలుపు నిచ్చారు. క్విట్ ఇండియా ఉద్యమం స్ఫూర్తి కొనసాగించాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహిపాల్, నాయకులు నరేష్, నర్సయ్య, నందమ్మ, ఎల్లప్ప, సంగమేశ్వర్, వంశీ, మహేశ్వర్, బాల్ రాజ్, వీరయ్య గౌడ్, రాంశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ తల్లిపాల వారోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం .

**కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ జెబా శామీమ్.**

**ముర్రుపాల ప్రాముఖ్యత శిశుకు. తల్లీ కీ కలిగే లాభాల గురించి వివరణ.**




**కల్హే ర్. 5.ఆగస్టు. ప్రజా జ్యోతి** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ జెబా మాట్లాడుతూ ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, కుటుంబ సభ్యులకు తల్లిపాల వల్ల శిశువుకు కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. శిశువు జన్మించిన మొదటి గంటలోనే తల్లిపాలను ప్రారంభించాలని, తొలి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, అనంతరం పౌష్టికాహారంతో పాటు రెండు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలను కొనసాగించాలని సూచించారు. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించడంతో పాటు వ్యాధి నిరోధక శక్తిని పెంపొందిస్తాయని, అలాగే తల్లి ఆరోగ్య పరిరక్షణలో కూడా కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రోత్సాహక ప్రతిజ్ఞ చేయించి, తల్లిపాల ప్రాముఖ్యతను ప్రతి కుటుంబానికి చేరవేయాలని పిలుపునిచ్చారు.

వైద్య అధికారి: డా. జేబా షమీమిన్ ఏఎన్ఎమ్: బాలమణి స్టాఫ్ నర్స్: జ్యోతి . అంగన్వాడీ టీచర్స్ బి నాగలక్ష్మి. డి స్వప్న. ఎస్ సునీత. కే. ప్రభావతి. తో పాటు కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణీలు, బాలింతలు మరియు స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## కల్హేర్‌లో పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంఈవో. బి. సురేష్



**కల్హేర్, ఆగస్టు 5. ప్రజా జ్యోతి** కల్హేర్ మండల విద్యాధికారి (ఎంఈవో) సురేష్ బుధవారం దేవునిపల్లి, భుగ్యానాయక్ తండా ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల బోధన తీరు, మధ్యాహ్న భోజన నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ విద్యా ప్రమాణాల అమలులో నిర్లక్ష్యం లేకుండా విధులు నిర్వహించాలని, విద్యార్థుల అభ్యాస నైపుణ్యాల పెంపుపై దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు.

# ఆగస్టు 6 నుంచి( ఫస్ )యాప్ ద్వారానే ఎరువుల విక్రయాలు

కల్హేర్ మండల రైతులకు వ్యవసాయ శాఖ సూచనలు.

బి. వెంకటేశం వ్యవసాయ అధికారి



**కల్హేర్, ఆగస్టు 5. ప్రజా జ్యోతి** కల్హేర్ మండల రైతులకు వ్యవసాయ శాఖ కీలక సూచనలు జారీ చేసింది. ఆగస్టు 6, 2026 నుంచి ఎరువుల కొనుగోలు, విక్రయాలు పూర్తిగా ఫస్ (ఫ్రేమవర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ ) విధానం ద్వారా మాత్రమే నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి వెంకటేశం తెలిపారు. ఈ విధానంలో ఎరువులు కొనుగోలు చేయాలంటే రైతులు తప్పనిసరిగా ఆధార్‌కు అనుసంధానమైన ఫార్మర్ ఐడి కలిగి ఉండాలని పేర్కొన్నారు. అలాగే ఆధార్‌తో లింక్ అయిన మొబైల్ నంబర్ యాక్టివ్‌గా ఉండాలని, కొనుగోలు సమయంలో ఓటీపీ ద్వారా ధృవీకరణ తప్పనిసరిగా ఉంటుందని వెల్లడించారు. రైతులు తమ భూమి, పంట వివరాలను ముందుగానే నమోదు చేసుకోవాలని సూచించారు. ఎరువులు కొనుగోలు చేసే సమయంలో రిటైలర్ వద్ద ఓటీపీ లేదా క్యూర్ కోడ్ ద్వారా ధృవీకరణ పూర్తయిన తర్వాతే ఎరువులు అందజేయబ డతాయని తెలిపారు. రైతు స్వయంగా హాజరై ఎరువులు స్వీకరించడం మంచిదని సూచించారు. ఆగస్టు 6 నుంచి ఫస్ యాప్ ద్వారానే ఎరువుల అమ్మకాలు జరుగనున్న నేపథ్యంలో, కల్హేర్ మండల రైతులు తమ ఫార్మర్ ఐడి , ఆధార్-మొబైల్ అనుసంధానం, భూమి, పంట వివరాలను ముందుగానే సరిచూసుకుని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సిద్ధంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి వెంకటేశం కోరారు.

# పుల్కల్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై కపట ప్రేమ ప్రదర్శించొద్దు: దుర్గారెడ్డి

మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్‌పై మండల కాంగ్రెస్ అధ్యక్షుడి విమర్శలు



**అందోల్, ఆగస్టు 5 (ప్రజాజ్యోతి):** పుల్కల్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విషయంలో మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ప్రజలపై కపట ప్రేమ ప్రదర్శించడం మానుకోవాలని పుల్కల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దుర్గారెడ్డి విమర్శించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక ప్రజల మెప్పు కోసం పుల్కల్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను సందర్శించి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో పేదలకు సొంతింటి కలను సాకారం చేయడంలో పూర్తిగా విఫలమైందని, పుల్కల్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పిచ్చిమొక్కలతో నిండిపోయి, రోడ్లు వంటి కనీస మౌలిక సదుపాయాలు లేక సంవత్సరాల తరబడి నిరుపయోగంగా ఉన్నాయని అన్నారు. జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించగా నాణ్యత లోపాలు బయటపడటంతో మంత్రి దామోదర రాజనర్సింహ ప్రత్యేక నిధులు కేటాయించి మరమ్మతులు చేపట్టించారని తెలిపారు. ప్రస్తుతం అర్హులైన లబ్ధిదారులకు అన్ని సౌకర్యాలతో ఇళ్లను అందించేందుకు ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసిందన్నారు.

మాజీ మంత్రి బాబుమోహన్ మంజూరు చేసిన 150 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో 100 ఇళ్లను పుల్కల్‌కు కాకుండా వేరే ప్రాంతానికి తరలించిన చరిత్ర కూడా మాజీ ఎమ్మెల్యే హయాంలోనే జరిగిందని ఆరోపించారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తికాకముందే కొందరిని రెచ్చగొట్టి ఇళ్లలో ఉండాలని ప్రోత్సహించడం ద్వారా పనులకు ఆటంకం కలిగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనివల్ల అసలైన లబ్ధిదారులకే నష్టం జరుగుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తూ గృహ కలను సాకారం చేస్తోందని చెప్పారు. గత పదేళ్లలో అందోల్ నియోజకవర్గం అభివృద్ధికి దూరంగా ఉండగా, రెండేళ్లలోనే మంత్రి దామోదర రాజనర్సింహ నాయకత్వంలో రహదారులు, గృహాలు, సంక్షేమం, మౌలిక వసతుల రంగాల్లో గణనీయమైన అభివృద్ధి జరిగిందన్నారు.

ప్రజల్లో ఆదరణ కోల్పోవడంతోనే మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ కొత్త రాజకీయ నాటకాలకు తెరలేపుతున్నారని దుర్గారెడ్డి విమర్శించారు. ఎలాంటి విమర్శలు, కుట్రలు వచ్చినా అందోల్ అభివృద్ధి ఆగదని, ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

# ప్రైవేట్ వద్దు... ప్రభుత్వమే ముద్దు

తన కూతురిని అంగన్‌వాడీలో చేర్పించి ఆదర్శంగా నిలిచిన సర్పంచ్ జైపాల్ నాయక్

**అందోల్, ఆగస్టు 5 (ప్రజాజ్యోతి):** ప్రభుత్వ విద్యాసంస్థలపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించేలా గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు, బొమ్మరెడ్డిగూడెం గ్రామ సర్పంచ్ జైపాల్ నాయక్ తన కూతురు జాదావత్ మోక్ష నాయక్‌ను సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి చౌరస్తా సమీపంలోని ఏపీహెచ్‌బీ కాలనీ ఫేజ్--2 అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చేర్పించి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా జైపాల్ నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం, గుడ్లు, ఆటల ద్వారా అభ్యాసం, వర్క్‌బుక్స్, ప్రాథమిక విద్య వంటి సదుపాయాలు అందిస్తున్నారని చెప్పారు. చిన్నారుల్లో పాఠశాల పట్ల భయం తొలగించి, విద్యపై ఆసక్తి పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. “ప్రభుత్వ బడుల్లో చదువులు... మన పిల్లల జీవితాలకు వెలుగులు” అనే నమ్మకంతోనే తన కుమార్తెను అంగన్‌వాడీలో చేర్పించినట్లు తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ప్రతి తల్లిదండ్రులు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.



ప్రజాప్రతినిధిగా తానే ముందుండి తన కుమార్తెను ప్రభుత్వ అంగన్‌వాడీలో చేర్పించడం ద్వారా ఇతరులకు ఆదర్శంగా నిలిచిన జైపాల్ నాయక్ నిర్ణయాన్ని పలువురు అభినందించారు. ప్రజాప్రతినిధులు తమ మాటలతోనే కాకుండా చేతలతోనూ ప్రభుత్వ విద్యపై విశ్వాసాన్ని చాటాలని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# ఖదీరాబాద్ పీఏసీఎస్ ఛైర్మన్‌గా రమేష్ జోషి ఏకగ్రీవ ఎన్నిక

రైతు సంక్షేమమే లక్ష్యం..

సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్న నూతన ఛైర్మన్



**అందోల్, ఆగస్టు 5 (ప్రజాజ్యోతి):** సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలంలోని ఖదీరాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఛైర్మన్‌గా మాజీ మండల అధ్యక్షుడు రమేష్ జోషి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డైరెక్టర్లు, మండల నాయకుల ఏకాభిప్రాయంతో ఆయనను ఛైర్మన్‌గా ఎన్నుకోవడంతో ఎన్నిక ఏకగ్రీవంగా ముగిసింది. సహకార సంఘాన్ని మరింత బలోపేతం చేసి రైతులకు నాణ్యమైన సేవలు అందించాలనే లక్ష్యంతో అనుభవజ్ఞుడైన రమేష్ జోషికి బాధ్యతలు అప్పగించినట్లు నాయకులు తెలిపారు. ఎరువులు, విత్తనాల సరఫరా, రుణాల మంజూరు, రైతులకు అవసరమైన సేవలను మరింత పారదర్శకంగా, వేగవంతంగా అందించేలా కృషి చేయాలని ఈ సందర్భంగా సూచించారు. నూతనంగా ఎన్నికైన రమేష్ జోషి మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచిన డైరెక్టర్లు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సంక్షేమాన్ని ప్రథమ ప్రాధాన్యంగా తీసుకుని సహకార సంఘాన్ని ఆదర్శ పీఏసీఎస్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని చెప్పారు. రైతులకు ప్రభుత్వ పథకాలు, సహకార సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. రమేష్ జోషి నాయకత్వంలో ఖదీరాబాద్ పీఏసీఎస్ మరింత అభివృద్ధి సాధించి రైతులకు మెరుగైన సేవలు అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, మండల సర్పంచులు, మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం నూతన ఛైర్మన్ రమేష్ జోషిని పూలమాలలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# జర్నలిస్టుల సంక్షేమమే ఐజేయూ ప్రధాన ధ్యేయం

ఐజేయూ జాయింట్ సెక్రటరీ సుమన్



**అందోల్, ఆగస్టు 5 (ప్రజాజ్యోతి):** జిల్లాలో జర్నలిస్టుల సంక్షేమం కోసం కార్యాచరణను వేగవంతం చేయనున్నట్లు సంగారెడ్డి జిల్లా టియూడబ్ల్యూ(ఐజేయూ) జాయింట్ సెక్రటరీ సుమన్ తెలిపారు. ఇటీవల సదాశివపేటలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. ముఖ్యంగా అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయించే అంశాన్ని ప్రధాన అజెండాగా తీసుకుని ప్రభుత్వ ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రాలు సమర్పించనున్నట్లు వెల్లడించారు. సమస్యల పరిష్కారం కోసం దశలవారీ కార్యాచరణ రూపొందించి యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యమాత్మకంగా ముందుకు సాగుతామని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి జాయింట్ సెక్రటరీ బాధ్యతలు అప్పగించిన యూనియన్ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ, జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని సుమన్ పేర్కొన్నారు.

# ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్న అలానా పరిశ్రమ



సాయంత్రం వేళల్లో వ్యర్థాల విడుదలతో తీవ్ర వాయు కాలుష్యంపై -- చర్యలు తీసుకోవాలి

2వ వార్డ్ బిఆర్ఎస్ నాయకుడు ఇంద్రారెడ్డి డిమాండ్




జహీరాబాద్, ఆగస్టు 05 (ప్రజా జ్యోతి న్యూస్) జహీరాబాద్ పట్టణ పరిధి లోని అలానా పరిశ్రమ నుంచి ప్రతి రోజూ సాయంత్రం 7 గంటల తర్వాత గాలిలోకి విడుదలవుతున్న వ్యర్థాల కారణంగా పరిసర ప్రాంతాల్లో తీవ్రవాయు కాలుష్యం ఏర్పడి ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతోందని 2వ వార్డ్ బిఆర్ఎస్ నాయకుడు ఇంద్రారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమ నుంచి వెలువడుతున్న కాలుష్య గాలిని పీల్చుకోవాల్సి రావడంతో చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు శ్వాసకోశ సమస్యలు, దగ్గు, కళ్ల మంట వంటి అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజలు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి నప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకో లేదని ఆరోపించారు. పరిశ్రమ వల్ల ఏర్పడుతున్న వాయు కాలుష్యంపై కాలుష్య నియంత్రణ మండలి (ౌశీశ్రీశ్రీబ్‌ఱశీఅ జశీఅ్‌తీశీశ్రీ దీశీబతీ) అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, కాలుష్య నియంత్రణ నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనే విషయాన్ని పరిశీలించాలని, నిబంధన లను ఉల్లంఘించినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యంకంటే పరిశ్రమలు ముఖ్యమా ?. ఇంద్రారెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ, "పరిశ్రమల అభివృద్ధి అవసరమే అయి నప్పటికీ, ప్రజల ఆరోగ్యం దెబ్బతినే విధంగా ఎవరూ వ్యవహ రించకూడదు. స్వచ్ఛమైన గాలి పీల్చడం ప్రతి పౌరుడి హక్కు. కాలుష్య నియంత్రణ నిబంధనలను ప్రతి పరిశ్రమ తప్పనిసరిగా పాటించాలి. ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే పరిస్థితులను ప్రభుత్వం, సంబంధిత అధికారులు ఏమాత్రం ఉపేక్షించకూడదు. వెంటనే కాలుష్యంపై సమగ్ర విచారణ జరిపి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే చర్యలు తీసుకోవాలి. అవసరమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి," అని కోరారు. పరిసర ప్రాంతాల ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని సంబంధిత శాఖలు తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# తల్లిపాలే శిశువు ఆరోగ్యానికి శ్రీరామరక్ష





కన్సాన్‌పల్లి అంగన్‌వాడీలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించిన ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంగీత

**అందోలు, ఆగస్టు 5 (ప్రజాజ్యోతి):** తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అందోలు మండలం కన్సాన్‌పల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గ్రామ సర్పంచ్ సునీత మహిపాల్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంగీత మాట్లాడుతూ.. తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ ఆహారమని అన్నారు. పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించడం ద్వారా శిశువుకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని, తొలి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం వల్ల అనేక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని వివరించారు. ఆరు నెలల తర్వాత తల్లిపాలతో పాటు పౌష్టికాహారం అందించడం ద్వారా చిన్నారుల ఎదుగుదల మరింత మెరుగుపడుతుందని తెలిపారు. తల్లిపాల వారోత్సవాల నిర్వహణ ఉద్దేశం ప్రతి తల్లిలో తల్లిపాలపై అవగాహన పెంచి, శిశు మరణాలను తగ్గించడం, చిన్నారులు ఆరోగ్యంగా ఎదిగేలా చూడడమేనని చెప్పారు. అనంతరం ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించి, తల్లులకు శిశు సంరక్షణ, పోషకాహారంపై సూచనలు అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రామకల, సాయమ్మ, రమాదేవి, వార్డు సభ్యురాలు కవిత, ఏఎన్ఎం శాంతి, ఆశా కార్యకర్త మాధవి, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభం మార్పిడి పనులు పూర్తి -- కాలనీ వాసుల్లో హర్షం



**కల్హే ర్. 5.ఆగస్టు. ప్రజా జ్యోతి.** సంగారెడ్డి జిల్లాలోని మండల కేంద్రమైన కల్హే ర్ ఏ. పి. జే.కలాం కాలనీ లో ఎన్నో రోజులుగా వంగి ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాన్ని విద్యుత్ శాఖ అధికారులు కొత్త స్తంభంతో మార్చి ఏర్పాటు చేశారు. ఈ పనులను విద్యుత్ శాఖ ఏఈ (అసిస్టెంట్ ఇంజనీర్ ), లైన్‌మెన్‌లు మరియు విద్యుత్ సిబ్బంది పర్యవేక్షణలో విజయవంతంగా పూర్తి చేశారు. ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న పాత విద్యుత్ స్తంభం స్థానంలో కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయడంతో కాలనీ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్య పరిష్కారమవడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తూ విద్యుత్ శాఖ అధికారులకు, ఏఈకి, లైన్‌మెన్‌లకు మరియు విద్యుత్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. స్థానికుల సహకారంతో సిబ్బంది సురక్షితంగా పనులు పూర్తి చేయడం అభినందనీయమని కాలనీ వాసులు పేర్కొన్నారు. కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు కావడంతో ఇకపై విద్యుత్ సరఫరా మరింత సురక్షితంగా, అంతరాయం లేకుండా కొనసాగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఆర్టీసీ కొత్తగా 3 నుంచి 5 బస్ డిపోలు

**హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య పెరుగుతుండటంతో ఆర్టీసీ కొత్తగా 3 నుంచి 5 బస్ డిపోల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. డిసెంబరు నాటికి ప్రస్తుతమున్న 26 డిపోల సంఖ్యను 31కి పెంచేందుకు ముషీరాబాద్‌లో హైదరాబాద్-3, నాగారం రోడ్డులో జవహర్‌నగర్ డిపోలతో పాటు మూతబడిన రాణిగంజ్-2 డిపోను పునఃప్రారంభించనున్నారు. స్థల కేటాయింపుపై రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లను కోరారు. నగరంలో ప్రస్తుతం 493 ఈవీ బస్సులు నడుస్తుండగా.. అన్ని డిపోల్లో ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రయాణికులకు మెరుగైన రవాణా సేవలు అందించేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది.

## జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎన్నికైన రాజుకు ఘన సన్మానం

**పత్రికలు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేయాలి: మాజీ కౌన్సిలర్ తుపాకుల సునీల్ కుమార్**



**అందోల్, ఆగస్టు 5 (ప్రజాజ్యోతి):** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ (టిడబ్ల్యూజేయూ--ఐజేయూ) సంగారెడ్డి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎన్నికైన జోగిపేట పట్టణానికి చెందిన ఉలువల రాజును ఆయన చిన్ననాటి మిత్రులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పూలమాలలు, శాలువాలతో సత్కరించి శు భాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ కౌన్సిలర్ తుపాకుల సునీల్ కుమార్ మాట్లాడుతూ, పత్రికలు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావాలని అన్నారు. జర్నలిస్టులు నిజాయితీ, నిష్పాక్షికతతో వార్తలను అందించి సమాజానికి సేవ చేయాలని సూచించారు. చిన్ననాటి నుంచే నాయకత్వ లక్షణాలు కనబరిచిన ఉలువల రాజు విద్యార్థి దశలో క్లాస్ మానిటర్‌గా, అనంతరం జోగిపేట నెహ్రూ మెమోరియల్ కళాశాల విద్యార్థి సంఘ అధ్యక్షుడిగా పనిచేశారని, ఇప్పుడు జిల్లా స్థాయి జర్నలిస్టు సంఘంలో కీలక బాధ్యతలు చేపట్టడం అభినందనీయమని మిత్రులు పేర్కొన్నారు. భవిష్యత్తులో జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఎదిగి పత్రికా రంగంలో మరింత గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రెడ్డిపల్లి శ్రీనివాస్, కొత్త శ్రీశైలం, శ్రీనివాస్ రెడ్డి, ఆకుల నందు తదితరులు పాల్గొని ఉలువల రాజుకు శుభాకాంక్షలు తెలిపారు.

## జొన్న రైతులకు రూ.77 కోట్లు విడుదల

**-- ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి**



నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 5: జొన్నల కొనుగోళ్లకు సంబంధించి రైతులకు చెల్లించాల్సిన బకాయిల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.77 కోట్లు విడుదల చేసినట్లు నారాయణఖేడ్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ హామీల అమలు కమిటీ చైర్మన్ డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..జొన్నల కొనుగోళ్ల బకాయిల చెల్లింపులో జాప్యం కారణంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తన విజ్ఞప్తికి ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రూ.77 కోట్ల నిధులను విడుదల చేసిందని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 30 జొన్నల కొనుగోలు కేంద్రాల ద్వారా సుమారు 48 వేల మంది రైతుల నుంచి 50 వేల టన్నుల జొన్నలను కొనుగోలు చేసినట్లు వివరించారు. ఇప్పటికే రైతుల ఖాతాల్లో రూ.183 కోట్లు జమ కాగా, మిగిలిన రూ.77 కోట్ల బకాయిలను తాజాగా విడుదల చేసి రైతుల ఖాతాల్లో జమ చేసే ప్రక్రియ ప్రారంభమైనట్లు తెలిపారు. రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతులకు రావాల్సిన ప్రతి రూపాయి సకాలంలో అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని స్పష్టం చేశారు. తన విజ్ఞప్తికి వెంటనే స్పందించి నిధుల విడుదలకు సహకరించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ వినోద్ పాటిల్, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి సర్పంచ్ ఆర్థిక సహాయం



**అందోలు, ఆగస్టు 5 (ప్రజాజ్యోతి):** నేరడిగుంట--మక్తగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో అనారోగ్యంతో మృతి చెందిన వడ్డె నర్సింలు కుటుంబాన్ని గ్రామ సర్పంచ్ వొగ్గు సాయికిరణ్ బుధవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, మానవతా దృక్పథంతో రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, గ్రామ పంచాయతీ తరపున ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఈశ్వర్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొని వడ్డె నర్సింలుకు నివాళులర్పించారు.

## నల్లవాగు ప్రాజెక్ట్ కాలువలకు సాగునీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే

**-మొదటిపేజీ తరువాయి**

సిర్గాపూర్ మండల పరిధిలో ఉన్న నల్లవాగు ప్రాజెక్టులో నీరు సమృద్ధిగా అందుబాటులో ఉండటంతో, అలుగు ద్వారా నీరు వృథా కాకుండా రైతులకు ఉపయోగపడేలా దిగువ ప్రాంతాలకు సాగునీటిని విడుదల చేసినట్లు తెలిపారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యత అని పేర్కొన్నారు. ప్రాజెక్టులో పుష్కలంగా నీరు ఉండటంతో సాగునీటి కొరత లేకుండా రైతులకు నీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అవసరమైన సమయంలో కాలువల ద్వారా సాగునీటిని విడుదల చేయాలని అధికారులకు ఆదేశించారు. రైతులు సాగునీటిని పొదుపుగా, ప్రాజెక్టు పరిధిలోని చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ వినోద్ పాటిల్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ రావు పాటిల్, యాదవ్ రెడ్డి, రమేష్ చౌహాన్, శ్యామ్ ముదిరాజ్, హన్మంతు, నరేందర్, గణేష్, రవీందర్ పాటిల్, మల్నొడ్డి తుకారాం, బండారి సాయిలు, గోవింద్ నాయక్, పలువురు సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, విట్టల్, వీరచారి, జైరాజ్, జమీల్, రాములు సేట్, బాబా ఖాన్, రమేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## ముఖేరిపీర్ దర్గా ప్రహరీ గోడ ధ్వంసం

**-మొదటిపేజీ తరువాయి**

నుంచి పరారయ్యారు.అయితే ఒక వ్యక్తిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు.ఈ సందర్భంగా దర్గాకు వక్ఫ్ ముతవల్లీ మహమ్మద్ యాదుల్, స్థానికులు మాట్లాడుతూ..సుమారు 200 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ దర్గా నారాయణఖేడ్‌కు ఆధ్యాత్మిక, చారిత్రక గుర్తింపుగా నిలిచిందని తెలిపారు. ఇక్కడ నిత్యం ప్రార్థనలు, మతపరమైన కార్యక్రమాలు జరుగుతుంటాయని పేర్కొన్నారు. ఈరోజు మధ్యాన్నం కొందరు వ్యక్తులు ప్రహరీ గోడను ధ్వంసం చేసి పవిత్ర స్థలాన్ని అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టుబడిన వ్యక్తి తనను కొందరు డబ్బులు ఇస్తామని పిలిచి ఈ పని చేయించారని చెప్పినట్లు స్థానికులు ఆరోపించారు. అయితే ఈ విషయంపై పోలీసుల విచారణలోనే వాస్తవాలు తేలాల్సి ఉందని పేర్కొన్నారు. ఘటన జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాలు ఉన్నాయని, వాటి ఆధారంగా నిందితులను వెంటనే గుర్తించి అరెస్టు చేయాలని పోలీసులను కోరారు. అలాగే ధ్వంసమైన ప్రహరీ గోడను ప్రభుత్వం పునర్నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. సంబంధిత అధికారులు వెంటనే ఘటనాస్థలిని సందర్శించి పరిస్థితిని పరిశీలించాలని వారు కోరారు. మతపరమైన ప్రార్థనా స్థలాలపై ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జ

## నల్లవాగు ప్రాజెక్ట్ కాలువలకు సాగునీటి విడుదల

**చివరి ఆయకట్టు వరకు నీరు అందిస్తాం ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి**

**రైతులు నీటిని వృధా కాకుండా సద్వినియోగంగా ఉపయోగించుకోవాలి.**



**కల్హే ర్ , ఆగస్టు 5: ప్రజా జ్యోతి** సంగారెడ్డి జిల్లాలోని సంయుక్త మండలమైన కల్హే ర్  సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగు మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టు నిన్న రాత్రి కురిసిన భారీ వర్షాల కారణంగా పూర్తిస్థాయిలో నిండి అలుగు పారుతోంది. అలుగు ద్వారా నీరు వృథాగా పోకుండా, రైతులకు సాగునీటి అవసరాలు తీర్చే లక్ష్యంతో ప్రాజెక్ట్ కాలువలకు నీటిని విడుదల చేసినట్లు నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నల్లవాగు ప్రాజెక్టు పరిధిలోని చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టినట్లు చెప్పారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా నీటి సరఫరా జరిగేలా ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు.

ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీటిని సద్వినియోగం చేస్తూ వ్యవసాయానికి అవసరమైన సాగునీటిని అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. నీటి విడుదలతో నల్లవాగు ప్రాజెక్టు కింద సాగు చేస్తున్న రైతులకు ప్రయోజనం చేకూరనుందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. నీటిపారుదల శాఖ ఇంజనీర్. అధికారులు ఉన్నతాధికారులు ప్రజా నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రూ.70 కోట్లు జొన్నల కొనుగోలు డబ్బులు విడుదల

**-- ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి హర్షం**



నారాయణఖేడ్, ఆగస్టు 5: సంగారెడ్డి జిల్లాకు జొన్నల కొనుగోలు డబ్బులు రూ.70 కోట్లు విడుదలైనట్లు నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జొన్నల కొనుగోలు బకాయిలను వెంటనే విడుదల చేయాలని తాను చేసిన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి సంగారెడ్డి జిల్లాకు రూ.70 కోట్లు విడుదల చేసిన తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకం సకాలంలో చేరేలా చర్యలు తీసుకుంటోందని, వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల ఆర్థిక పురోగతే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు.